క్లుప్తంగా

జేసీని కలిసిన వీఆర్వో సంఘ నేతలు



నెల్లూరు(అర్బన్): నూతనంగా బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లును ఆయన చాంబర్‌లో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం(వీఆర్వో అసోసియేషన్) నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పంట అశోక్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి రమణయ్య, డివిజన్ అధ్యక్షుడు మొగళ్లూరు నాగేశ్వరరావు, వీఆర్వోలు రవి, శేఖర్, రాజేశ్వరి, విష్ణు, చైతన్య, జయరాజు, చిన్నారావు, మునిబాబు, రమణారావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 42వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ నగర మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ మస్తాన్ ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ ఆస్పత్రి వారిచే ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. సుమారు 250 మందికి ఉచిత కంటి పరీక్షలు చేశారు. వివిధ సమస్యలు ఉన్నవారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని అబ్దుల్ మస్తాన్ తెలిపారు. అనంతరం ఆయన సొంత నిధులతో మందులు అందజేశారు.

పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డు వనంతోపు సెంటర్ వద్ద ఉన్న అబైడింగ్‌హోప్ ట్రస్ట్ కార్యాలయంలో ఆ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో 150 మంది క్షయ బాధితులకు న్యూట్రిషన్ ఫుడ్ కిట్‌లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారాయణ దంత వైద్యకళాశాల హెచ్‌ఓడీ కణ్ణన్ పాల్గొని, మాట్లాడారు. క్షయ బాధితులకు పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎ.జయప్రకాష్, క్రాంతికుమార్, జ్యోతిచౌదరి, మధు తదితరులు పాల్గొన్నారు.

పురుషులకు అదనంగా బస్సులు నడపండి

నెల్లూరు సిటీ: స్త్రీశక్తి పథకం అమలు తరువాత ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, ఈ క్రమంలో నెల్లూరు–పామూరు మార్గంలో మగవారికి, వృద్ధుల సౌకర్యార్థం అదనంగా బస్సులు నడపాలని సంగంకు చెందిన సునీల్‌కుమార్ కోరారు. నెల్లూరు డిపో–1 మేనేజర్ వెంకటేశ్వర్లు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో పరిధిలోని పలు ప్రాంతాల నుంచి ఎనిమిది మంది ప్రయాణికులు తమ సమస్యలను అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఏటూరుకు చెందిన సుజాత, రాఘవేంద్రలు ఉదయం తమ గ్రామం నుంచి మెయిన్‌రోడ్డుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కోవూరుకు చెందిన శ్రీనివాసులు మాట్లాడుతూ పీఎస్‌ఆర్ బస్టాండ్ పక్కన బుచ్చిరెడ్డిపాళెం బస్సులు నిలిపే ప్రదేశంలో బస్ షెల్టర్ నిర్మించాలని కోరారు. పొదలకూరుకు చెందిన నారాయణ ఉదయం 9 గంటలకు నెల్లూరు నుంచి తమ ఊరికి పల్లెవెలుగు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ముద్దమూడికి చెందిన ఏడుకొండలు సాయంత్రం 5.15 నిమిషాల తరువాత తమ గ్రామానికి బస్సు సౌకర్యం లేదని, అదనపు సర్వీసులు కల్పించాలని కోరారు. రాజుపాళేనికి చెందిన ఆరిఫ్ మాట్లాడుతూ ఎక్స్‌ప్రెస్ బస్సులు నార్తు రాజుపాళెం గ్రామం గుండా నడపాలని కోరారు. అలాగే సంగం నుంచి చేజర్లకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ హామీ ఇచ్చారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణా తరగతులు

నెల్లూరు(బారకాసు): ఎన్‌ఎంసీ కార్యాలయ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతులను బుధవారం నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా నియమించిన కార్యక్రమానికి కమిషనర్ నందన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ పురపాలక సంఘాల్లో ఎంతో కీలకమైనదని, వీటి గురించి క్షుణ్ణంగా తెలుసుకుని ఆచరిస్తే చెత్త నుంచి సంపద పొందవచ్చని తెలిపారు. అనంతరం శిక్షణా తరగతులను నిర్వహించిన రాజేష్, రిసోర్స్ పర్సన్స్ శ్రీనివాస్, రమాదేవిలను కమిషనర్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



వీరబ్రహ్మేంద్రుని దేవస్థానంలో..



సీతారామ మందిరంలో అన్నపూర్ణగా..



కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో చందనాలంకారం



ధర్మరాజస్వామి ఆలయంలో అన్నపూర్ణగా..



లక్ష్మీనరసింహస్వామి అలంకారంలో..

జయహే.. శక్తిరూపిణి

- వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): శరన్నవరాత్రి మహోత్సవాలు మూడో రోజు బుధవారం నగరంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జగజ్జనని.. శక్తిరూపిణి.. పాహిమాం.. అంటూ పూజలు చేశారు. ఈ క్రమంలో రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. సంపుటీకరణ, చండీహోమం నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణంలోని మీనాక్షీసుందరేశ్వరస్వామి ఆలయంలో లలితా కుంకుమార్చన, మహన్యాసం జరిపారు. ఉభయకర్తలుగా గడ్డం రత్నయ్య– సుజాత, కె.లక్ష్మీవెంకటసంజీవరావు– హిమబిందు, సోమవరపు సూర్యనారాయణ– విజయలక్ష్మి, కొండ్రెడ్డి భరత్‌కుమార్– ఇందిరా ప్రియదర్శిని దంపతులు వ్యవహరించారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జంజం శ్రీనివాసరావు, ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ ఏలూరు శిరీష పర్యవేక్షించారు.

⇨ స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా శేగు షణ్ముఖరావు– వాణి, మహేంద్రకుమార్– రాజ్యలక్ష్మి దంపతులు వ్యవహించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు షణ్ముఖరావు, నిచ్చెనమెట్ల చిరంజీవి, ఉమ్మెన జనార్ధన్, ఆంజనేయులు, వేముల ప్రసాద్, మునగా వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

⇨ మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు భువనేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా టి.అభిమన్యు– సత్యవతి, పి.నందకిశోర్‌రెడ్డి– శ్రీసుధ, పి.జగదీష్‌రెడ్డి– మైథిలి దంపతులు వ్యవహరించారు.

⇨ సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఐ.సునీల్‌కుమార్– మహాలక్ష్మి, కె.మధుసూదన్– గిరిజ దంపతులు వ్యవహరించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్, ఈఓ వి.గిరికృష్ణ పర్యవేక్షించారు.

⇨ సీఏఎం హైస్కూల్ రోడ్డులో ఉన్న ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు గాయత్రి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా తస్కాని వెంకటేశ్వర్లు– శశికళ దంపతులు వ్యవహరించారు. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలు బాలాజీసింగ్, జీసీ ధరమ్‌సింగ్, ఈఓ బొగ్గుల మల్లికార్జునరెడ్డి, ప్రధానార్చకుడు శ్రీనివాసులుశర్మ పర్యవేక్షించారు.



ధైర్యలక్ష్మిగా అమ్మవారు

⇨ ఏసీ నగర్ కోదండరామపురం మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా శీలం మల్లికార్జున– పద్మావతి, బింగిమళ్ల రాజేష్– హరిత దంపతులు వ్యవహరించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ పత్తి నరసింహం, సభ్యులు పత్తి శ్రీనివాసులు, కాటేపల్లి వెంకటరమణయ్య, ఎర్రా వీరరాఘవులు, దామెర చంద్రమౌళి, ఎర్రా వెంకటసుబ్బయ్యనాయుడు, తుమ్మల శ్రీనివాసులురెడ్డి, చిమ్మిరి గోవిందరాజులు, మలుచూరి చంద్రారెడ్డి పర్యవేక్షించారు.

⇨ మెక్లిన్స్ రోడ్డు విరాట్‌నగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గాయత్రీదేవి, గోవిందమాంబలకు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు వేదమాత మహాగాయత్రి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పోలూరు సాయిప్రసాద్‌ఆచారి– పద్మప్రియ, సీతారామయ్యఆచారి– కస్తూరి దంపతులు, దేవిశెట్టి వెంకటసుబ్బయ్యశెట్టి వ్యవహరించారు. నిర్వాహకులు కందుకూరు చంగయ్యఆచారి, అలిమేలి శ్రీహరిఆచారి, విగ్రహాల బాలకృష్ణ ఆచారి, దండపాణి సురేష్‌ఆచారి, కందుకూరు జనార్దన్‌ఆచారి, అలిమేలి సుబ్రహ్మణ్యం ఆచారి పర్యవేక్షించారు.

⇨ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అమ్మవారు అన్నపూర్ణ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా చిట్లూరి వెంకటేశ్వర్లు– ఝాన్సీలక్ష్మి దంపతులు వ్యవహరించారు. నిర్వాహకులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కొప్పరపు శివప్రసాద్, అమరా మోహన్‌రావు, స్వామి హనుమంతరావు, తాతా వెంకట కిశోర్‌కుమార్, వంకా శ్రీహరిరావు పాల్గొన్నారు.

⇨ నవాబుపేటలోని శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా రాగిపిండి వెంకటరెడ్డి– నాగరాజ దంపతులు వ్యవహరించారు. సాదా నాగేంద్రకుమార్, కంచి జ్ఞానేంద్ర, ఈఓ దర్గయ్య పర్యవేక్షించారు.

⇨ మూలాపేటలోని శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో అమ్మవారు కాళీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కె.సుధీర్, సురేష్ వ్యవహరించారు.

⇨ వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలోని గురువాయూర్ మహావిష్ణు, మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారు గాయత్రీమాత అలంకారంలో దర్శనమిచ్చారు.

వేదగిరిలో..

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మవారు ధైర్యలక్ష్మిగా దర్శనమిచ్చారు. భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

వెంకటేశ్వరపురంలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మూడో రోజు బుధవారం స్వామివారు లక్ష్మీనరసింహస్వామి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం చిన్నారుల కోసం కృపానందరాయలు చేసిన మ్యూజిక్ షో అలరించింది. కార్యక్రమాలకు పల్లాల విజయ, ఇండేల బయ్యపురెడ్డి, లక్ష్మీదేవమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు. అర్చకుడు సాయి భరద్వాజ్, ఆలయ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



వేదాయపాళెం మహాలక్ష్మి ఆలయంలో..



కోదండరామపురం మహాలక్ష్మి దేవస్థానంలో..

అస్మదీయులకే శీఘ్ర దర్శనం

- సామాన్య భక్తులపై చిన్నచూపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా భక్తులు భారీగా తరలివస్తున్నారు. అయితే తమవారికి మాత్రమే శీఘ్రంగా దర్శనం కల్పించేందుకు అధికార నేతలు పెత్తనం చెలాయిస్తున్నారు. కొందరు కమిటీ సభ్యులు, పోలీసు సిబ్బంది, దేవదాయ సిబ్బంది తమ వారిని దగ్గరుండి రూ.300 క్యూలైన్ నుంచి వారిని అమ్మణ్ణి దర్శనం కోసం పెత్తనం చెలాయిస్తూ దర్జాగా సాగనంపుతున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో అక్కడ పర్యవేక్షణ చేస్తున్న అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారు. దీనిపై సాక్షి సిబ్బంది తన కెమెరాలో బంధిస్తుంటే కొందరు భక్తులు కమిటీ చైర్మన్ భర్త దృష్టికి తీసుకెళ్లగా అదేమీ పెద్ద విషయం కానట్లు వ్యవహరించడం కొసమెరుపు.



టికెట్లు లేకుండానే సిఫార్సులతో ఆలయం లోపలకు పంపిస్తున్న సిబ్బంది

అడ్డంకిగా ఉన్న ర్యాంపులను తొలగిస్తాం

నెల్లూరు(బారకాసు): కాలువలను ఆక్రమిస్తూ చేపట్టిన మెట్లు, ర్యాంపులను తప్పనిసరిగా తొలగించి వేస్తామని నగరపాలక కమిషనర్ నందన్ తెలిపారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 46వ డివిజన్ ఇందిరా భవన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని శానిటేషన్ విభాగం అధికారులను ఆదేశించారు. ఇందిరా భవన్ రోడ్డులోని అన్నా క్యాంటీన్‌ను సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక కనకమహల్ కూడలి సమీపంలోని అనధికార భవన నిర్మాణ ప్రాంగణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. స్థానిక జీటీ రోడ్డు ప్రాంతంలో పర్యటించి, కాలువలను ఆక్రమిస్తూ ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని స్థానిక ప్రజలకు సూచించారు. కాలువల్లో క్రమం తప్పకుండా పూడికతీత పనులను చేపట్టి వాహనదారులు, పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ

నెల్లూరు సిటీ: వేర్వేరు ఘటనల్లో రెండు మోటారు సైకిళ్ల అపహరణపై బాధితులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రూరల్ మండలంలోని దేవరపాళేనికి చెందిన గడ్డం వెంకటేశ్వర్లు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 20వ తేదీన తన ఇంటి ముందు హోండా సీబీజెడ్ బైక్‌ను పార్కింగ్ చేసి ఇంట్లో నిద్రించారు. ఉదయం చూడగా బైక్ కనిపించలేదు. దీంతో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

⇨ చింతారెడ్డిపాళేనికి చెందిన ఎ.శ్రీధర్ కూలి పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మెడికవర్ హాస్పిటల్‌కు సమీపంలోని తన స్నేహితుని గదిలో గత నెల 25వ తేదీన నిద్రించారు. మరుసటి రోజు బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో బుధవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వికసిత్ భారత్ క్విజ్‌లో పాల్గొనండి

నెల్లూరురూరల్: వికసిత్ భారత్ క్విజ్ పోటీలకు యువత పాల్గొనాలని, మై భారత్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలని సెట్నల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు దశలలో వికసిత్ భారత్ క్విజ్ జరుగుతుందన్నారు. మొదటి దశ సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 15 వరకు సాంస్కృతిక, ఆవిష్కరణల ట్రాక్, రెండో దశ అక్టోబర్ 23 నుంచి నవంబర్ 5 వరకు వికసిత్ భారత్ చాలెంజ్ ట్రాక్, మూడో దశ నవంబర్ 24 నుంచి డిసెంబర్ 8 వరకు భారత్ కోసం డిజైన్, నాలుగో దశ జనవరి 10 నుంచి జనవరి 12 వరకు సామాజిక ప్రయోజనం కోసం ట్రాక్ జరుగుతాయని, జిల్లాలోని 15 నుంచి 29 ఏళ్ల వయస్సు గల యువత పాల్గొనాలని అన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



నెల్లూరుకు(అర్బన్): నగరంలోని వెంగళరావు నగర్ ఎస్సీటీ కాలనీలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మున్సిపల్ కార్పొరేషన్, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికుల కోసం బుధవారం సఫాయి సురక్షా శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ పాల్గొని, మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కార్పొరేషన్‌పై ఉందన్నారు. స్వచ్ఛభారత మిషన్ సహకారంతో కార్మికులకు ఆరోగ్య పరీక్షలతో పాటు బీపీ, షుగర్, నేత్ర, కేన్సర్ లాంటి వ్యాధులు గురించి అవగాహన కల్పించారు. అనంతరం కమిషనర్ నందన్, ఎంహెచ్‌ఓ కనకాద్రిలను అసోసియేషన్ నాయకులు సన్మానించారు. వైద్యాధికారి రీనాభారతి, వెటర్నరీ వైద్యాధికారి మదన్‌మోహన్, పీఎంపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, రూడ్స్ సంస్థ అధ్యక్షుడు రసూల్, కార్పొరేటర్ అవినాష్ పాల్గొన్నారు.

జీఎస్టీ పేరుతో ప్రజాధనం దోపిడీ



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గడిచిన ఎనిమిదేళ్ల నుంచి జీఎస్టీ పేరుతో బీజేపీ ప్రభుత్వం రూ.లక్షల కోట్ల ప్రజాధనాన్ని దోపిడీ చేసిందని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సిరాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్‌అహ్మద్ ఆరోపించారు. నగరంలోని ఆజాద్ సెంటర్‌లో ఉన్న ఇన్సాఫ్ కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక పరిపాలనను పక్కనపెట్టి ప్రజల సొమ్మును దోచుకునే పనిలో పాలకులు పడ్డారన్నారు. ఇష్టానుసారంగా ప్రతి వస్తువుపై జీఎస్టీ విధించి రూ.55 లక్షల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని, ఇప్పుడు జీఎస్టీ తగ్గించామని చెప్పుకోవడం ద్వారా దోపిడీని వారే అంగీకరించినట్లు అయిందన్నారు. ఈ సమావేశంలో ఇన్సాఫ్ నాయకులు షాన్‌వాజ్, షాజహాన్, లతీఫ్‌అహ్మద్, మున్వర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముల వద్ద పటిష్ట భద్రత



ఈవీఎం గోదాములను పరిశీలిస్తున్న కలెక్టర్

నెల్లూరు సిటీ: భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అమలు చేస్తూ ఈవీఎం గోదాముల వద్ద పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. నగరంలోని ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అగ్నిమాపక పరికరాలు కండీషన్‌లో ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారులకు సూచించారు. గోడౌన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రసూల్, శ్రీనివాస్, మందల వెంకటేష్, బాల సుధాకర్, డీఆర్వో విజయ్‌కుమార్, ఆర్డీఓ అనూష, తహసీల్దార్ షఫీమాలిక్, ఎలక్షన్ డీటీలు అషర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఢిల్లీ అడ్వైజరీ బోర్డు చైర్మన్‌గా జిల్లా వాసి



సుమంత్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఢిల్లీలోని తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు అడ్వైజరీ చైర్మన్‌గా కోవూరు నియోజకవర్గం విడవలూరు ప్రాంతానికి చెందిన ఏడుగుండ్ల సుమంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈయన గతంలో జిల్లాలో డీసీఎమ్మెస్ చైర్మన్‌గా పనిచేశారు. ఈ క్రమంలో ఆయన్ను బుధవారం పలువురు అభినందించారు.

డీకేడబ్ల్యూలో ఆయుర్వేద వైద్యంపై అవగాహన

నెల్లూరు (టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఆయుర్వేద వైద్యం, ఆయుష్ గురించి విద్యార్థినులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమణారావు మాట్లాడుతూ ఆయుర్వేదం వ్యాధి మూల కారణాన్ని పరిష్కరించేందుకు ప్రయతిస్తుందన్నారు. ఈ విధానం ప్రకృతితో అనుసంధానమై ఉండటం వల్ల వ్యాధి నివారణ సులభతరమవుతుందన్నారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

నెల్లూరు (టౌన్): విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని డాక్టర్ బి.రాజేశ్వరరావు తెలిపారు. స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య జాగ్రత్తలను వలంటీర్లుగా వెళ్లి వివరించాలన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమణారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు సత్యనారాయణ, కన్యాకుమారి, తమన్నా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి నిద్రిస్తుండగా..

- కాళ్లపై నుంచి వెళ్లిన లారీ

నెల్లూరు సిటీ: నిద్రిస్తున్న వ్యక్తి కాళ్లపై లారీ వెళ్లడంతో తీవ్రగాయాలపాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రూరల్ పరిధిలోని వెంకటరమణ రైస్ మిల్లులో దొడ్డపనేని మురళీ కూలి పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆయన పడుకుని ఉండగా వడ్లు దించడానికి వచ్చిన లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా బండిని నడపడంతో నిద్రిస్తున్న మురళీ కాళ్లను లారీ తొక్కించింది. తీవ్రగాయాలైన వ్యక్తిని స్థానికులు హుటాహుటిన హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాదంలో అతని రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. దీనిపై బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరానికి రూ.13.50 కోట్ల నిధులు



మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



హాజరైన అధికారులు

నెల్లూరు రూరల్: నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌లో భాగంగా నెల్లూరు నగరానికి 2025–26 సంవత్సరానికి రూ.13.50 కోట్ల నిధులు మంజూరైనట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. నిధుల వినియోగానికి సంబంధించి అమలు కమిటీ సమావేశాన్ని ఆయన చాంబర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మియావాకీ ప్లాంటేషన్‌తో నగరంలో పచ్చదనం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తొలుత పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి, నెల్లూరుకు స్వచ్ఛమైన గాలి కోసం సమగ్ర కార్యాచరణను రూపొందించారన్నారు. వాయు కాలుష్య స్థాయిలను తగ్గించడానికి ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయడం కోసం సిటీ ఇంప్లిమెంటేషన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో కమిషనర్ నందన్, డీటీసీ చందర్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మారుతి ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం



నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని 12వ డివిజన్ చింతారెడ్డిపాళెంలో రూ.26 లక్షల నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.